క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ సమావేశం

ఉయ్యూరు: వైఎస్సార్‌ సీపీ పెనమలూరు నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశం ఈనెల 17వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఉయ్యూరు మార్కెట్‌యార్డు ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పార్థసారథి వ్యక్తిగత సహాయకుడు కె.జనార్దన్‌ తెలిపారు. సమావేశానికి జిల్లా పరిశీలకుడు, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, నియోజకవర్గ పరిశీలకుడు బొప్పన భవకుమార్, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, శ్రేణులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

అర్హులకు సంక్షేమం అందాలి

కంకిపాడు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరాలని గొల్లగూడెం సర్పంచ్‌ నత్తా దుర్గాభవాని స్పష్టం చేశారు. గ్రామ సచివాలయ ప్రాంగణంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు, రేషన్‌కార్డులు, పింఛన్లు, జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే తదితర అంశాలపై సమీక్ష జరిపారు. దుర్గాభవాని మాట్లాడుతూ పథకాలు అందించే విషయంలో లోపాలు తలెత్తకుండా చూడాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు దక్కాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగాలని సూచించారు. అగ్రిబోర్డు మాజీ చైర్మన్‌ నత్తా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉన్నత ఆశయంతో సంక్షేమ పాలన అందిస్తోందన్నారు.

వైద్యానికి 'మానవత' సాయం

హనుమాన్‌జంక్షన్‌ రూరల్‌: అనారోగ్యంతో బాధపడుతున్న అభాగ్యులకు వైద్య ఖర్చుల నిమిత్తం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రూ.35 వేలు ఆర్థికసాయాన్ని సోమవారం అందజేసింది. స్థానిక ఏలూరురోడ్డులోని గణపతి కాంప్లెక్స్‌లో మానవత సభ్యులు ఈ మొత్తాన్ని పంపిణీ చేశారు. బాపులపాడుకు చెందిన గుప్తా కుమార్తె ఉమాశ్రీ డెంగీ జ్వరం, ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో ఆమె కుటుంబానికి రూ.25 వేలు, ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై కాలుకు శస్త్రచికిత్స చేయించుకున్న రుద్రపాటి నాగలక్ష్మికి రూ.10 వేలు ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో మానవత రాష్ట్ర కన్వీనర్‌ మారుబోయిన కోటేశ్వరరావు, జిల్లా కోశాధికారి వడ్డి రాజేశ్వరరావు, హనుమాన్‌జంక్షన్‌ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనకు కృషి

కంకిపాడు: గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని జగన్నాథపురం సర్పంచ్‌ పిన్నబోయిన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జగన్నాథపురం ప్రధాన రహదారి అభివృద్ధి పనులు సోమవారం చేపట్టారు. పనులను గ్రామ సర్పంచ్‌ శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారి బీటలు వారి, అధ్వానంగా మారటంతో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి దృష్టికి సమస్యను తీసుకెళ్లామన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి ఆదేశాలతో మండల పరిషత్‌ నుంచి రూ. 7 లక్షలు నిధులు కేటాయించారన్నారు. రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బండి శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.

రేపు ఉయ్యూరులో 'జగనన్నకు చెబుదాం'

ఉయ్యూరు: జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఈనెల 18న ఉయ్యూరులో నిర్వహించనున్నట్లు తహసీల్దార్‌ మస్తాన్‌ తెలిపారు. స్థానిక మున్సిపల్‌ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై మున్సిపల్, మండల పరిషత్, రెవెన్యూ శాఖల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్‌ మస్తాన్‌ మాట్లాడుతూ పట్టణంలోని కాకర్ల కన్వెన్షన్‌లో ఈనెల 18న జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్‌ పి.రాజాబాబు, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు. ప్రజలు నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారన్నారు. ఉయ్యూరు పట్టణం, మండలంలోని గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ అర్జీలు స్వీకరిస్తారన్నారు. సాయంత్రం 3 గంటల నుంచి సమస్యల పరిష్కారం, సమీక్ష ఉంటాయని వివరించారు.

అందరి ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



మద్దూరు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



ఎనికేపాడులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న గౌడ కార్పొరేషన్‌ చైర్మన్‌ మాదు శివరామకృష్ణ తదితరులు

పెనమలూరు: రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవితం గడపాలనేదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. వణుకూరు-2 సచివాలయంలో సోమవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జగనన్న ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్రంలో 45 రోజుల పాటు నిర్వహిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.67 కోట్ల కుటుంబాలకు వైద్య సేవలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. 14 రకాల వైద్య పరీక్షలు చేసి 172 రకాల మందులు పంపిణీ చేస్తుందని వివరించారు. గతంలో దేశంలో ఎక్కడా లేని విధంగా జగనన్న ప్రభుత్వం ప్రతి ఇంటికీ సర్వే నిర్వహించి వ్యాధులతో ఉన్న వారిని గుర్తించి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో పూర్తి వైద్య సేవలు అందిస్తుందని వివరించారు. దాదాపు 5 వేల మంది వైద్యులు రాష్ట్ర వ్యాప్తంగా వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అందరి సహకారంతో ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని మార్చాలన్నారు. వైద్య శిబిరంలో అందుతున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు. పలువురు రోగులతో మాట్లాడారు.

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ..

బాల్య వివాహాల వల్ల సమాజంలో రుగ్మతలు ఏర్పడతాయని, ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలను నిర్మూలించాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల రహిత దేశంగా భారతదేశాన్ని స్థాపించాలని, దీనికి అందరి కృషి ఉండాలని సూచించారు. బాల్య వివాహాలు చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చక్క విజయ ఉపసర్పంచి గద్దల రాజా, మండల ప్రత్యేకాధికారి ఎ.శ్రీనివాసరావు, వైద్యుడు రవికు

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

మార్, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, కంకిపాడు జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు, ఉయ్యూరు ఏఎంసీ చైర్మన్‌ వల్లభనేని వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు వేమూరి రాజా, వైఎస్సార్‌ సీపీ నేతలు వల్లే నరసింహారావు, చక్క గోపీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ నాణ్యమైన ఉచిత వైద్యం

గన్నవరంరూరల్‌: ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత వైద్యం ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ అనగాని రవి చెప్పారు. మండలంలోని సూరంపల్లి హైస్కూల్‌ ఆవరణలో సోమవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శిబిరం ప్రారంభించారు. శిబిరంలో 523 మందికి వైద్య సేవలందించారు. జెడ్పీ కోఆప్షన్‌ సభ్యుడు ఎండీ గౌసాని, సర్పంచ్‌ పులపాక బాబూరావు, ఎంపీటీసీలు కొండా సీతారామయ్య, బాణోతు నీలిమ, ఎంపీడీవో సత్యకుమార్, వైద్యాధికారి ఆనంద్‌బాబు, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ నాగపద్మావతి, పంచాయతీ కార్యదర్శి కోట సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు కందిమళ్ళ రాఘవ, సచివాలయం సిబ్బంది, వలంటీర్‌లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో కార్పొరేట్‌ స్థాయి వైద్యసేవలు

రామవరప్పాడు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్‌ వైద్యం అందుతుందని గౌడ కార్పొరేషన్‌ చైర్మన్‌ మాదు శివరామకృష్ణ అన్నారు. విజయవాడ రూరల్‌ మండలం ఎనికేపాడులో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య బృందం గ్రామస్తులు సుమారు 1000 మందికి పలు రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ



వణుకూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఎమ్మెల్యే పార్థసారథి

చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు, సర్పంచ్‌ రాచమళ్ల పూర్ణచంద్రరావు, ఎంపీడీఓ భార్గవి, గన్నవరం మార్కెట్‌యార్డ్‌ చైర్మన్‌ అంజనీకుమారి, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

'సురక్ష'తో ప్రజారోగ్యం భద్రం

కంకిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజారోగ్యం మెరుగుపడుతుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని మద్దూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్‌ సుధా ప్రసూజ, డాక్టర్‌ ఎం.సంతోష చంద్రిక, డాక్టర్‌ నికిత, డాక్టర్‌ ప్రణవ్‌ రాఘవ్‌ రోగులకు వైద్య సేవలు అందించారు. 610 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పార్థసారథి శిబిరాన్ని సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, సర్పంచ్‌ చిప్పల రామదాసు, ఎంపీటీసీ వడుగు శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్‌ మద్దాలి రామచంద్రరావు, కమ్మ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ రామినేని రమాదేవి, తహసీల్దార్‌ పీఎస్‌వీ ప్రసాద్, ఎంపీడీఓ పి.అనూష పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

ఉంగుటూరు: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు అన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో బాల్య వివాహాల నిర్మూలనపై స్వయం సహాయక సంఘాల సభ్యులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలతో కలిగే నష్టాలను వివరించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఈ విషయమై అవగాహన కల్పించి బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. బాలికా విద్యను ప్రోత్సహించి వారి భవితకు బంగారు బాటలు వేద్దాం అని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సాంబశివరావు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

బాల్య వివాహ నిరోధంపై ప్రతిజ్ఞ

ఉయ్యూరు: మండలంలోని పెద ఓగిరాల సచివాలయంలో బాల్య వివాహ నిరోధంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్‌ త్రిపురం లక్ష్మి, ఎంపీటీసీ గుంటక నాగిరెడ్డి,



పెద ఓగిరాల సచివాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కార్యదర్శి పివి సుబ్బారావు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది స్థానికులు ప్రతిజ్ఞ చేశారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

కంకిపాడు: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని జేసీఎస్‌ మండల చైర్మన్‌ రాచూరి చిరంజీవి అన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని నినదిస్తూ కంకిపాడులో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాల్లో మార్పులు


హనుమాన్‌జంక్షన్‌ రూరల్‌: గడిచిన నాలుగున్నర ఏళ్లలో విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డికే దక్కుతుందని పలువురు వైఎస్సార్‌ సీపీ నాయకులు కొనియాడారు. బాపులపాడు మండలం కాకులపాడులో సోమవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బాపులపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్‌ ఎంజే మంజూష నేతృత్వంలోని వైద్యుల బృందం 531 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్‌ నక్కా గాంధీ, బాపులపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు పడకల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

పెనమలూరు: ఆన్‌లైన్‌ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెనమలూరు సీఐ టీవీవీ రామారావు అన్నారు. ఆయన సోమవారం విలేకరులకు వివరాలు తెలుపుతూ పెనమలూరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆన్‌లైన్‌ మోసాలు ఎక్కువగా నమోదు అవుతున్నాయని తెలిపారు. సైబర్‌ నేరగాళ్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూ అమాయకులకు ఆశ చూపి బ్యాంకు ఖాతాలో సొమ్ము స్వాహా చేస్తున్నారన్నారు. ఎవరైన అపరిచితులు ఫోన్‌ చేసి ఓటీపీ అడిగితే షేర్‌ చెయ్యవద్దన్నారు. సైబర్‌ నేరాలు అనేక విధాలుగా నేరాలు చేస్తున్నారని, లాటరీలు,గిఫ్టులు, పార్ట్‌టైమ్‌ ఉద్యోగాలు, సులభంగా సొమ్ము సంపాదించుకోవచ్చని ఆశ చూపితే తొందరపాటుగా వ్యవహరించొద్దని హెచ్చరించారు.

సైబర్‌మోసాలపై అవగాహన

కంకిపాడు: సైబర్‌మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మంతెన సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్‌ కె.జయమాధురి అన్నారు. ఆర్థిక అక్షరాస్యతపై మంతెన గ్రామంలో సొసైటీ ఫర్‌ సోషల్‌ ట్రాన్స్‌ఫర్మేషన్‌ సంస్థ ఆధ్వర్యంలో ఆర్‌బీఐ సౌజన్యంతో అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల జిల్లా సమన్వయకర్త కె.శ్రీనివాసరావు, కౌన్సిలర్లు కైలే సునీల్‌కుమార్, హేమారావు అక్షరాస్యతపై అవగాహన కల్పించారు.



అవగాహన సదస్సులో కరపత్రాలు ప్రదర్శిస్తున్న ప్రతినిధులు

భారతదేశాన్ని గ్లోబల్‌ లీడర్‌గా మార్చాలి

పెనమలూరు: భారతదేశాన్ని గ్లోబల్‌ లీడర్‌గా మార్చే విధంగా విద్యార్థులు కృషి చేయాలని అవాంటెల్‌ లిమిటెడ్‌ వ్యవస్థాపకుడు డాక్టర్‌ అబ్బూరి విద్యాసాగర్‌ అన్నారు. కానూరు వీఆర్‌ సిద్ధార్థ ఇంజినీరింగ్‌ కాలేజీలో సోమవారం మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్‌ కలాం జయంతి సందర్భంగా ఇన్నోవేషన్‌ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన డాక్టర్‌ విద్యాసాగర్‌ మాట్లాడుతూ భారతదేశాన్ని గ్లోబల్‌ లీడర్‌గా మార్చడానికి విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలని కోరారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఆవిష్కరణల పట్ల మక్కువ చూపాలన్నారు. వారికి కాలేజీ నుంచి ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు. ఇన్నోవేషన్‌ డేలో వివిధ ఇంజినీరింగ్‌ కాలేజీల నుంచి 500 మంది విద్యార్థులు పాల్గొని వివిధ మోడల్స్‌ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ కన్వీనర్‌ మలినేని రాజయ్య, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఏవీ రత్నప్రసాద్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలిస్తున్న విద్యాసాగర్‌

పంచముఖీ.. పాహిమాం



మంతెనలో గాయత్రీదేవి అలంకారంలో దుర్గమ్మకు పూజలు చేస్తున్న భవానీలు, భక్తులు

కంకిపాడు: గాయత్రీ మాతా.. పాహిమాం.. అంటూ భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు. దసరా నవరాత్రుల్లో రెండో రోజైన సోమవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కంకిపాడు శివాలయంలో, ఈడుపుగల్లు శ్రీ కామేశ్వర, వీరభద్రస్వామి దేవస్థానం, ప్రొద్దుటూరు శివాలయంలో గాయత్రీదేవిగా భక్తుల పూజలందుకున్నారు. కంకిపాడు పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీ మాత అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. మంతెన రామాలయం సెంటరులోని కనకదుర్గమ్మ మందిరంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తుల పూజలందుకున్నారు.

గాయత్రీ దేవి అలంకరణలో పేరంటాలమ్మ

రామవరప్పాడు: విజయవాడరూరల్‌ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పంచమ వేద కూచిపూడి నృత్యాలయం గురువు కావ్య ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

గన్నవరంలో..

గన్నవరం: శ్రీదేవీ శరన్నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక పాత గన్నవరంలోని లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో గాయత్రీదేవికి పలువురు దంపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలు జరిపారు. స్థానిక సొసైటీ పేటలోని గాయత్రీదేవి మందిరంలో సప్తశతి(చండీ) హోమం నిర్వహించారు. స్థానిక యాదవుల రామాలయంలో అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులచే పూజలందుకున్నారు. పెద్దమ్మతల్లి ఆలయం, కేసరపల్లి, అల్లాపురం, బుద్ధవరంలో శరన్నవరాత్రులు కొనసాగుతున్నాయి.

గన్నవరం రూరల్‌లో..

గన్నవరంరూరల్‌: మండలంలోని గ్రామాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి భక్తులు కొలిచారు. ముస్తాబాద శివాలయం, పురుషోత్తపట్నం శివాలయం, సూరంపల్లి శివాలయాల్లో పూజలు జరిగాయి.

నున్నలో..

నున్న(విజయవాడరూరల్‌): శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో రెండవ రోజు సోమవారం అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. నున్న గ్రామం చెరువు సెంటర్లో శ్రీదుర్గాదేవి దేవస్థానంలో అమ్మవారికి ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని సాంబిరెడ్డి దంపతులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో శ్రీగాయత్రీదేవిగా అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రీఅన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో గాయత్రీదేవిగా అలంకారం చేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. చినకంచి, విలేజి కుందావారి కండ్రిక, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో కూడా శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.



పెదపులిపాకలో గాయత్రీదేవిగా..



ఉయ్యూరులో వేదమాతగా..



గాయత్రీదేవిగా అలంకారమైన పేరంటాలమ్మ



గన్నవరంలోని లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో..

ఆలయాల్లో విశేష పూజలు

ఉయ్యూరు: ఉయ్యూరులోని విజయ దుర్గాభవాని ఆలయంలో గాయత్రీదేవిగా, ఉయ్యూరు శివాలయంలో బాల త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చి విశేష పూజలందుకున్నారు.

భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పూజలు

పెనమలూరు: మండల పరిధిలో దసరా శరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. యనమలకుదురులో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో పార్వతీదేవికి మంగళవారం బ్రహ్మచారిణిదేవిగా దివ్య అలంకరణ చేశారు. గ్రామంలో కనకదుర్గ అమ్మవారి ఆలయం, పెదపులిపాక విజయరాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవార్లకు గాయత్రీదేవి అలంకరణ చేశారు. మండల పరిధిలో లక్ష్మీపురంకాలనీ వెంకటేశ్వరస్వామివారి ఆలయం, పోరంకి సాయిబాబా మందిరం, వైకుంఠపురంలో అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు.

బ్లూమింగ్‌డేల్‌ పాఠశాలలో..

పెనమలూరు: గంగూరు బ్లూమింగ్‌డేల్‌ ఇంటర్నేషనల్‌ పాఠశాలలో సోమవారం దేవీనవరాత్రుల వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కాంగ్రెస్‌ నేతలకు అభినందన

పెనమలూరు: కాంగ్రెస్‌ నేతలకు పదవులు వచ్చిన సందర్భంగా యువజన కాంగ్రెస్‌ నాయకుడు పల్లి నవీన్‌ అభినందనలు తెలిపారు. కానూరులో సోమవారం కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో ఏపీ పీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన ధనేకుల మురళీమోహన్‌రావు, గొలుల కృష్ణ, ప్రధాన కార్యదర్శి మొవ్వా మోహన్‌రావు, జిల్లా కాంగ్రెస్‌ అధ్యక్షుడు వింత సంజీవరెడ్డిని సన్మానించారు.